


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 27-03-2026 | సంపుటి - 27 | సంచిక -304 | రూ : 4 | పేజీలు: 8




2లో

## బతుకులు బుగ్గి

- మార్కాపురం శివారులో టిప్పర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఐదు నెలల పసికందు సహా 14 మంది సజీవ దహనం
- 29 మందికి గాయాలు
- గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన మృతదేహాలు
- డీఎన్ఏ పరీక్షలు చేయించి బంధువులకు అప్పగించేందుకు ఏర్పాట్లు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల పరిహారం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

### విద్య.. వైద్యానికి

## నిధుల్లో కోత పెట్టం..

- అవసరమైతే మరిన్ని నిధులిస్తాం
- గత 27 నెలల్లో పేదల చికిత్సలకు రూ.4,500 కోట్లు వెచ్చించాం
- ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తాం
- వైద్యాధికారులపై పరిపాలన భారం లేకుండా చూస్తామని వెల్లడి
- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని.. వాటికి ఒక్క రూపాయి కూడా కోత విధించబోమని, అవసరమైతే మరిన్ని నిధులిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. గత 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. ఆరోగ్యశ్రీకి బకాయిల సమస్య గత ప్రభుత్వ నిర్వాకమేనని, వాటిని చెల్లిస్తూనే ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నామన్నారు. తరువాయి 2లో

## పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం

2లో

- దావోస్ పర్యటనల ద్వారా రూ.2.19 లక్షల కోట్లు వచ్చాయి
- 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు
- శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు



### పుతిన్ నుంచి ఇరాన్‌కు డ్రోన్ల డెలివరీ..

## అమెరికా కదలికలపై రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ చేరవేత!

- రష్యా ఇరాన్ మధ్య యుద్ధ సమయంలోనూ కొనసాగుతున్న స్నేహ బంధం
- ఇరాన్ డిజైన్లతో రష్యాలో తయారైన గెరాన్2 డ్రోన్లు
- ఈ డ్రోన్లను దశలవారీగా ఇరాన్‌కు పంపుతున్న రష్యా



2లో



### ఇరాన్ చమురు కొనుగోలు వార్తలపై క్లారిటీ ఇచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్

2లో




2లో

### ఆస్ట్రేలియాలోకి ఇరాన్ పౌరులకు

## 'నో ఎంట్రీ'..

- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ భద్రత దృష్ట్యా నిర్ణయం
- ఇప్పటికే జారీ చేసిన వీసాలను కూడా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటన
- తాజా నిర్ణయంతో ఇరాన్ విద్యార్థులు, పర్యాటకులకు తీవ్ర ఇబ్బందులు



2లో


## నేడు శ్రీ సీతారాముల కళ్యాణానికి సీఎం

### రాజధానిపై జగన్ కుట్రల్ని

## అసెంబ్లీలో ఎండగడదాం

- అమరావతికి చట్టబద్ధతపై 28న తీర్మానం
- అదే రోజు కేంద్రానికి..
- వీలైతే ఏప్రిల్ 2నే పార్లమెంటులో బిల్లు
- అమరావతి కేవలం రాజధానే కాదు.. ప్రజల భావోద్వేగం
- మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

2లో





2లో

### ఆలిండియా పర్మిట్‌కు వక్రభాష్యం

- టూరిస్ట్ బస్సులుగా నడిపేందుకే కేంద్రం అనుమతి
- ప్రయాణికులతో వివిధ ప్రాంతాల మధ్య ట్రావెల్స్ బస్సుల పరుగులు
- ప్రమాదాలు జరిగినప్పుడే రవాణాశాఖ హడావుడి




# బతుకులు బుగ్గి

ఒంగోలు: వారంతా ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని వెళ్లారు. శ్రీరామనవమి పండగ ఉందని సొంతూళ్లకు బయల్దేరారు. మరో రెండు గంటల్లో గమ్యస్థానం చేరిపోయేవారే.. అంతలో ఉన్నట్టుండి పెద్ద శబ్దం.. మంటలు.. పొగ.. చేతనైన వాళ్లు అద్దాలు పగలగొట్టి కిందకి దూకేశారు. ఈలోపే అగ్నికీలలు చుట్టుముట్టాయి.. 14 నిండుప్రాణాలు బుగ్గయిపోయాయి! తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరికి వెళ్తున్న హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు... మార్కాపురం శివారు రాయవరం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి 14 మంది సజీవ దహనమయ్యారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఐదు నెలల చిన్నారి ఉన్నాడు. డ్రైవర్ సహా 29 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన 14 మందిని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. వేకువజామున 5.40 గంటల సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నవారికి రూ.2 లక్షల చొప్పున సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

**బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం**

రోడ్డుకు ఎడమవైపు వెళ్లాల్సిన బస్సు డ్రైవర్.. మూలమలుపు వద్ద నిర్లక్ష్యంగా కుడివైపు వెళ్లి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టాడు. టిప్పర్ డీజిల్ ట్యాంకు పగిలిపోవడంతో మంటలు రేగి ప్రమాద తీవ్రత పెరిగింది. 28 మంది ఎలాగోలా బస్సు అద్దాలు పగలగొట్టి దూకేసి.. ప్రాణాలు కాపాడుకున్నారు. పైనుంచి దూకినవారిలో కొందరికి ఎముకలు విరిగాయి. మరికొందరికి కాలిన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 14 మందిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతదేహాలను మార్కాపురం మార్చురీకి తరలించారు. ప్రయాణికుల జాబితాను బట్టి మృతులెవరనేది తెలిసింది. గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాలు అప్పగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఘటనాస్థలాన్ని హోంమంత్రి అనిత, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, సురేష్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, రవాణా, పోలీసు శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు.

**ఎక్కువ మంది బేల్దారి కూలీలే**

నెల్లూరు జిల్లా ఉదయగిరి, మార్కాపురం జిల్లా నుంచి కూలీలు నిర్మాణ పనుల కోసం తెలంగాణలోని జగిత్యాల, కామారెడ్డి, ఆర్మూర్ ప్రాంతాలకు వెళ్లారు. వీరంతా శ్రీరామనవమి ఉత్సవాల కోసం బుధవారం సాయంత్రం స్వస్థలాలకు బయల్దేరారు. గురువారం ఉదయం 5.40కి బస్సు మార్కాపురం దాటి వెళ్తుండగా... రహదారి మూలమలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంగా కుడివైపు వెళ్లాడు. ఎదురుగా వస్తున్న టిప్పర్ డ్రైవర్ గమనించి వెంటనే తన వాహనాన్ని పక్కకు తప్పించే ప్రయత్నం చేశాడు. ఈలోగా బస్సు టిప్పర్ సగభాగానికి వచ్చి బలంగా ఢీకొట్టడంతో డీజిల్ ట్యాంకు పగిలి వెంటనే మంటలు వ్యాపించి, రెండు వాహనాలకూ అంటుకున్నాయి. ప్రమాదతీవ్రతకు టిప్పర్ బోల్తాపడింది. దాని డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. దట్టంగా పొగ కమ్ముకొని ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. కొంతమంది బస్సు అద్దాలు పగలగొట్టుకొని దూకేశారు. ముందుభాగంలో ఉన్నవారే ఎక్కువమంది బయటపడ్డారు.

## పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం

హైదరాబాద్: దావోస్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుల ద్వారా రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తుంటే ఓర్వలేక విపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. పెట్టుబడులు, అవగాహన ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గురువారం శాసనసభలో దావోస్ పెట్టుబడులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ''ఎంవోయూలు కుదుర్చుకున్న తర్వాత అవి కార్యరూపంలోకి రావడానికి సమయం పడుతుంది. దీనిపై అవగాహన లేకుండా కొందరు సభ్యులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఎంవోయూను అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. 2024 దావోస్ పర్యటనలో 18 ఎంవోయూల ద్వారా రూ.40,232 కోట్లు, 2025 పర్యటనలో 26 ఎంవోయూల ద్వారా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో వచ్చిన 6 కంపెనీలకు భూములు కేటాయించాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరింది. రూ.30 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే మరో 3 కంపెనీలకు భూములను గుర్తించాం. నిజామాబాద్ ఐటీ టవర్‌లో 11 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 276 మంది పని చేస్తున్నారు. సిద్దిపేట టవర్‌లో పనిచేస్తున్న సంస్థలకు మరో మూడేళ్ల పాటు రాయితీలు కొనసాగిస్తాం. ముఖ్యమంత్రి చొరవ వల్ల ఖమ్మంలో త్వరలోనే స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ ప్రారంభం కాబోతోంది. కేంద్ర మంత్రి కుమారస్వామి వచ్చి దీనిపై ప్రకటన చేస్తారు. ఆదిలాబాద్‌లో సీసీఐని పునఃప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం'' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## విద్య.. వైద్యానికి నిధుల్లో కోత పెట్టం

హైదరాబాద్: రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని.. వాటికి ఒక్క రూపాయి కూడా కోత విధించబోమని, అవసరమైతే మరిన్ని నిధులిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. గత 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. ఆరోగ్యశ్రీకి బకాయిల సమస్య గత ప్రభుత్వ నిర్వాకమేనని, వాటిని చెల్లిస్తూనే ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నామన్నారు. వైద్యరంగంలో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, శాఖలో సంస్కరణలు తీసుకురాబోతున్నామని.. సూపరింటెండెంట్‌లు, ఇతర అధికారులపై పరిపాలన భారం లేకుండా చేస్తామన్నారు. విదేశాల్లో ఉన్న మన వైద్యుల సేవలను రాష్ట్రంలో వినియోగించుకుంటామని తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తామన్నారు. ''రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిల వల్ల ప్రైవేటు ఆసుపత్రులు మూత పడుతున్నాయని, పేదల వైద్యంపై ప్రభావం పడుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బకాయిలు భారాస ప్రభుత్వ పుణ్యమే. వారి హయాంలో ఆరోగ్యశ్రీకి చెల్లింపులు సరిగా జరపలేదు. మేం అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వ బకాయిలు రూ.600.27 కోట్లున్నాయి. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.240.11 కోట్లు, ప్రైవేటు దవాఖానాలకు రూ.360.16 కోట్ల బకాయిలు ఉన్నాయి. మేం ఆ భారాన్ని మోస్తూనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ఈ పథకానికి ఇప్పటి వరకు రూ.2408.51 కోట్లు చెల్లించాం. భారాస ప్రభుత్వం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. మా సర్కారు ప్రతి నెలా రూ.89 కోట్లు వెచ్చిస్తోంది. ప్రస్తుతం ఉన్న బకాయిలు రూ.727 కోట్లే. ఇందులో ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించాల్సినవి తక్కువే. ఈ పథకం కింద వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య పెరిగింది. గతంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల విషయంలో అనేక అవకతవకలు జరిగాయి. కొంత మంది దుర్వినియోగం చేశారు. మా ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్‌లో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు విధానం చేపట్టాం. దీని వల్ల అక్రమాలకు అవకాశం లేకుండా పోయింది. సీఎం సహాయ నిధి కింద రూ.2,046 కోట్లకు సంబంధించి చెక్కులు ఇచ్చాం.

**కొత్తగా 10 వేల పడకలు..**

రాష్ట్రంలో 35 వైద్య కళాశాలలున్నాయి. బోధనాసుపత్రులకేమో రోగులు రావడం లేదు.. అదేసమయంలో పేదలు వైద్యం కోసం వెళ్లే చోట సరైన డాక్టర్లు లేరు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ రోగులను బోధనాసుపత్రులకు పంపించే ఆలోచన చేస్తున్నాం. అల్వాల్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్

## ఆలిండియా పర్మిట్‌కు వక్రభాష్యం

అమరావతి: కేంద్ర ప్రభుత్వం సదుద్దేశంతో బస్సులకు ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) జారీచేస్తుంటే ట్రావెల్స్ యాజమాన్యాలు దాన్ని మరోలా వినియోగించి.. కాసులు మిగుల్చుకుంటున్నాయి. విహారయాత్రలకు వెళ్లేవారు వివిధ రాష్ట్రాలకు బస్సులు బుక్ చేసుకొని వెళ్తే ఆ బస్సులు ఎన్ని రాష్ట్రాల మీదుగా వెళ్తే అన్నిచోట్లా పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా.. కేంద్రం వన్ నేషన్, వన్ పర్మిట్ విధానం తీసుకొచ్చింది. అంటే కేంద్ర రవాణాశాఖకు నిర్దేశిత ఫీజు చెల్లిస్తే.. ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) జారీచేస్తారు. దీంతో దేశంలో ఎక్కడికైనా బస్సులు నడపొచ్చు. ఆ బస్సు రిజిస్ట్రేషన్ అయిన రాష్ట్రంలో హోంట్యాక్స్ చెల్లిస్తే చాలు. పర్యాటకులను తీసుకెళ్లేందుకే ఏఐటీపీ ఉపయోగపడుతుంది. కానీ ట్రావెల్స్ సంస్థలు దీనికి వక్రభాష్యం చెబుతున్నాయి.

**దర్జాగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేస్తూ..**

ట్రావెల్స్ యాజమాన్యాలు దర్జాగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేస్తూ, వివిధ నగరాలు, పట్టణాల మధ్య నిత్యం బస్సులు నడుపుతున్నాయి. పర్యాటకులను ఒక నగరం నుంచి వేర్వేరు ప్రాంతాలకు తీసుకెళ్లి, మళ్లీ బయల్దేరిన నగరానికి తీసుకురావడానికి ఏఐటీపీ ఉపయోగపడుతుంది. కానీ ట్రావెల్స్ యాజమాన్యాలు వివిధ నగరాలు మధ్య, పట్టణాల మధ్య ప్రయాణికులను ఎక్కించుకొని తీసుకెళ్తాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. ఇలాంటివాటికి స్టేజ్ క్యారియర్ బస్సులుగా అనుమతి తీసుకొని, రాష్ట్రం పరిధిలోనే నడపాలి. కానీ ట్రావెల్స్ బస్సులన్నీ మూడు, నాలుగు రాష్ట్రాల మధ్య తిరుగుతున్నాయి.

*** ఘటనలు జరిగితేనే హడావుడి**

ఏదైనా పెద్ద ప్రమాదం జరిగినప్పుడే రవాణాశాఖ అధికారులు తనిఖీలతో హడావుడి చేస్తుంటారు. తర్వాత మళ్లీ షరామామూలే. కర్నూలు వద్ద ఏసీ స్లీపర్ బస్సు ప్రమాద సమయంలోనూ ఇలాగే హడావుడి చేశారు. ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు చేసి.. అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలు, అత్యవసర ద్వారాలు ఉన్నాయా? లేవా? అని చూశారు. దాదాపు 90 బస్సులను సీజ్ చేసి, మరో 90 బస్సులను తగిన పత్రాలు తెచ్చుకునేవరకూ నిలిపేశారు. ఇదంతా నవంబరు వరకు నడిచింది. తర్వాత ట్రావెల్స్ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించి, బస్సులను మళ్లీ రోడ్డెక్కించాయి. రవాణాశాఖ అధికారులు కూడా తనిఖీలు మానేశారు.

## రాజధానిపై జగన్ కుట్రల్ని అసెంబ్లీలో ఎండగడదాం

అమరావతి: అమరావతిని దెబ్బతీసేందుకు జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో చేసిన కుట్రలు, అప్పట్లో మంత్రులు, వైకాపా నాయకులు అమరావతిపై పదే పదే విషం కక్కడం, రాజధానిని కాపాడుకోవడానికి రైతులు చేసిన ఉద్యమాన్ని అణచివేసేందుకు సాగించిన దమనకాండను ప్రజల ముందుంచాలని మంత్రిమండలి నిర్ణయించింది. విజయవాడ గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటిస్తే... అప్పట్లో విపక్షనేతగా జగన్ దాన్ని సమర్థించారని, వైకాపా అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పేరుతో నాటకానికి తెర తీశారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై శనివారం శాసనసభలో చర్చించి, తీర్మానం చేయాలని సీఎం పేర్కొన్నారు. తీర్మానం ఆమోదించి అదే రోజు కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే, ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ ముందుకు తెస్తారని, వీలైతే ఏప్రిల్ 2న పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశముందని సీఎం వివరించారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా రాజధానిపైనే చర్చ జరిగింది. ఎజెండాలో రాజధాని అమరావతి 23వ అంశంగా ఉన్నప్పటికీ, దానిపైనే మొదట చర్చించారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో శాసనసభలో జరిగిన పరిణామాలను అప్పట్లో స్పీకర్‌గా ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. మనోహర్ అప్పట్లో చాలా పోరాడారని, స్పీకర్ హోదాలో ఆయనకు కొన్ని పరిమితులుంటాయి కాబట్టి వాటికి కట్టుబడి ఉండాల్సి వచ్చిందనుకుంటానని సీఎం వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే ఏకైక రాజధాని అంటూ తీర్పు చెప్పిన హైకోర్టు న్యాయమూర్తులు తర్వాత బదిలీపై వెళ్లినప్పుడు రాజధాని రైతులు, మహిళలు పలికిన అపూర్వ వీడ్కోలును ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

*** ఎవరూ కదిలించే అవకాశం లేకుండా కట్టుదిట్టం**

అమరావతికి చట్టబద్ధతపై ప్రవేశపెట్టే తీర్మానంలో పదజాలం ఎలా ఉండాలన్న అంశంపై చర్చించారు. తీర్మానంపై సమన్వయ బాధ్యతను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్‌లకు అప్పగించారు. రాజధానిని అమరావతి నుంచి భవిష్యత్తులో ఎవరూ కదిలించేందుకు వీల్లేకుండా, న్యాయపరంగా ఎలాంటి అవాంతరాలు ఎదురవకుండా దుర్భేద్యమైన చట్ట రక్షణ కల్పించేందుకు ఇది సువర్ణావకాశమని సీఎం పేర్కొన్నారు.

*** జగన్ అమరావతిని సర్వనాశనం చేయాలనుకున్నారు**

అమరావతిని సర్వనాశనం చేసేందుకు జగన్, ఆయన పార్టీ అనేక కుట్రలకు పాల్పడిందని కొందరు మంత్రులు చెప్పారు. మూడు రాజధానుల బిల్లును అప్పటి శాసనమండలి ఛైర్మన్ షరీఫ్ సెలక్ట్ కమిటీకి పంపిస్తే అడ్డుకున్నారనే అక్కసుతో అప్పటి మంత్రులు, వైకాపా సభ్యులు ఆయనపై దాడికి పాల్పడినంత పనిచేశారని సీఎం చెప్పారు. అయినా షరీఫ్ గట్టిగా నిలబడటం చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. తర్వాత మండలి ఛైర్మన్ సంతకం లేకుండానే ఆ బిల్లును గవర్నర్‌కు పంపారని, దానిపై అప్పట్లో రైతులు కోర్టుకెళ్లారని మనోహర్ చెప్పారు.

## నేడు శ్రీ సీతారాముల కల్యాణానికి సీఎం

ఖమ్మం : భద్రాచలంలో శుక్రవారం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు హాజరవుతున్నారు. హైదరాబాద్ నుంచి వాయు మార్గంలో ముఖ్యమంత్రి ఉదయం 10:15 గంటలకు స్థానిక సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో హెలికాప్టర్ దిగుతారు. పదిన్నర గంటలకు రామాలయ ప్రాంగణానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రితో పాటు ఏడుగురు మంత్రులు వస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రభుత్వం తరపున మిథిలా స్టేడియంలో జరిగే కల్యాణ వేడుకలో పాల్గొని సీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

**2వేల మంది పోలీసులతో భారీ భద్రత**

ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని భద్రాచలం పట్టణం ఆధ్యాత్మిక శోభతో పాటు కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. నేడు ముఖ్యమంత్రితో పాటు ఏడుగురు మంత్రులు హాజరవుతున్న దృష్ట్యా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో 2000 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తలంబ్రాలు, ప్రసాదాల కౌంటర్లను భారీగా ఏర్పాటు చేశారు. పట్టణమంతా డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల నిరంతర పర్యవేక్షణలో ఉండేలా చర్యలు చేపట్టారు.

*** రూ. 351 కోట్లతో ఆలయ ముఖచిత్రం మార్పు**

భద్రాచలం క్షేత్రాన్ని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 351 కోట్ల భారీ అభివృద్ధి పనులకు నేడు ముఖ్యమంత్రి భూమిపూజ చేయనున్నారు. కల్యాణోత్సవం ముగిసిన వెంటనే ఈ చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరగనుంది. గోదావరి కరకట్టల ఎత్తు పెంపు, సుందరమైన ఘాట్ల నిర్మాణం, భక్తుల కోసం మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఈ నిధులను ప్రభుత్వం కేటాయించింది. రహదారి, రైల్వే మార్గాల విస్తరణ ద్వారా భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు నేతృత్వంలో గురువారం సీఎం పర్యటించే మార్గాల్లో ట్రయల్ రన్ నిర్వహించి భద్రతను క్షుణ్ణంగా సమీక్షించారు. హెలిపాడ్ నుంచి ఐటీసీ గెస్ట్ హౌస్ వరకు, అక్కడి నుంచి ఆలయం, మిథిలా స్టేడియం వరకు ప్రతి అంగుళాన్ని భద్రతా సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.

## ఇరాన్ చమురు కొనుగోలు వార్తలపై క్లారిటీ ఇచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్

మార్చి 26: ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోలు చేసినట్లు తమపై వస్తున్న వార్తలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తీవ్రంగా ఖండించింది. ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవి అని కొట్టిపారేసింది. ఈ మేరకు గురువారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సముద్ర మార్గంలో చిక్కుకుపోయిన ఇరాన్ ముడి చమురుపై అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా ఆంక్షలను సడలించడంతో, రిలయన్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకుందని పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ నుంచి రిలయన్స్ సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసిందని ఈ కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే రిలయన్స్ స్పందించింది. "ఇరాన్‌కు చెందిన ముడి చమురును కంపెనీ కొనుగోలు చేసిందంటూ ఇటీవలి మీడియా నివేదికలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. ఈ నివేదికలు నిరాధారమైనవి. ప్రజలను తప్పుదారి పట్టించేలా, తప్పుడు వాదనలకు దారితీసేలా ఉన్నాయి" అని కంపెనీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వార్తలను ప్రచురించే ముందు సంబంధిత మీడియా సంస్థలు వాస్తవాలను ధృవీకరించుకోవాలని హితవు పలికింది.

## ఆస్ట్రేలియాలోకి ఇరాన్ పౌరులకు 'నో ఎంట్రీ'

మార్చి 26: పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ నుంచి వచ్చే సందర్శకులపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేసింది. ఆస్ట్రేలియా హోం వ్యవహారాల శాఖ ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్ పాస్‌పోర్ట్ కలిగిన వారు ఆస్ట్రేలియాలోకి ప్రవేశించడానికి అనుమతి లేదని తెలిపింది. అంతేకాకుండా, ఇప్పటికే జారీ చేసిన వీసాలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఇరాన్ తన సైనిక కార్యకలాపాలను పెంచుతూ ప్రాంతీయ అస్థిరతకు కారణమవుతోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆస్ట్రేలియా ప్రధాని పేర్కొన్నారు. అమెరికా, ఇతర మిత్రదేశాలతో కలిసి ఇరాన్‌పై అంతర్జాతీయ ఒత్తిడిని పెంచే వ్యూహంలో భాగంగానే ఆస్ట్రేలియా ఈ అడుగు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయంతో ఆస్ట్రేలియాకు వెళ్లాలనుకుంటున్న ఇరాన్ విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## పుతిన్ నుంచి ఇరాన్‌కు డ్రోన్ల డెలివరీ.. అమెరికా కదలికలపై రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ చేరవేత!

మార్చి 26: అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో భీకర యుద్ధం చేస్తున్న ఇరాన్‌కు రష్యా అండగా నిలుస్తోంది. ఒక మంచి స్నేహితుడిగా కేవలం మాటలకే పరిమితం కాకుండా... రష్యా ఇప్పుడు ఇరాన్‌కు సైనిక, నిఘా సహాయాన్ని భారీగా పెంచినట్లు పాశ్చాత్య దేశాల ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి.

*** పాశ్చాత్య దేశాల ఇంటెలిజెన్స్ వర్గాలు ఏం చెబుతున్నాయంటే..**

డ్రోన్లు, నిత్యావసరాలు: రష్యా తన వద్ద ఉన్న డ్రోన్లను (ముఖ్యంగా ఇరాన్ డిజైన్లతో రష్యాలో తయారైన గెరాన్ 2 వంటివి) దశలవారీగా ఇరాన్‌కు పంపిస్తోంది. ఈ నెలాఖరుకు ఈ రవాణా ప్రక్రియ పూర్తి కానుంది. యుద్ధం కారణంగా ఇరాన్‌లో ఏర్పడిన ఆహారం, ఔషధాల కొరతను తీర్చడానికి కూడా రష్యా తన వంతు సాయం చేస్తోంది. రియల్ టైమ్ ఇంటెలిజెన్స్: అమెరికా యుద్ధ నౌకలు, విమానాల కదలికలను రష్యా తన శాటిలైట్ల ద్వారా పర్యవేక్షించి, ఆ సమాచారాన్ని 'రియల్ టైమ్'లో ఇరాన్‌కు చేరవేస్తోంది. దీనివల్ల ఇరాన్ తన క్షిపణి దాడులను మరింత కచ్చితత్వంతో చేయగలుగుతోందని నిపుణులు భావిస్తున్నారు. బుషెహర్ ప్లాంట్ నుంచి తరలింపు: ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సమీపంలో మంగళవారం క్షిపణి పడటంతో రష్యా అప్రమత్తమైంది. అక్కడ పనిచేస్తున్న 163 మంది రష్యా సిబ్బందిని (రోసాటమ్ ఉద్యోగులు) సురక్షితంగా ఇరాన్ఆర్మేనియా సరిహద్దుకు తరలించింది.

# ప్రగతి నగర్ లో హిందూ సమ్మేళన సమితి ఏర్పాటు

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్ ) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా హిందూ బంధువులు జరుపుకుంటున్న సమ్మేళనాల్లో భాగంగా ప్రగతి నగర్ లో హిందూ మహా సమ్మేళనం జరపడానికి స్థానిక హిందువులు 'అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి' పేరు మీద ఒక సమ్మేళన సమితిని ఏర్పాటు చేసుకున్నారు. సనాతన హైందవ ధర్మ రక్షణ, హిందువుల సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, హిందూ బంధువుల ఐక్యత కోసం పార్టీలు, కులాలకతీతంగా జరుగుతున్న ఈ హిందూ మహా సమ్మేళనంలో హిందూ బంధువులందరూ పాల్గొనాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వెల్లడించారు. ఏప్రిల్ 12వ తేదీ ఆదివారం సాయంత్రం జరిగే ఈ సమావేశ స్థలం తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రగతి నగర్ లో జరిగిన ఒక సమావేశంలో పేర్కొన్నారు.

* **అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి:**

అధ్యక్షులుగా పొన్నాల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శిగా గరికపాటి సాంబశివ రావు, కోశాధికారిగా నిడసనమెట్ల లక్ష్మీ రామా రావు, కార్య నిర్వహణాధికారిగా డాక్టర్ ఎమ్ ఆర్ ఎస్ రాజు , ముఖ్య సలహాదారుగా ప్రొఫెసర్ చంద్రమౌళి, ఉపాధ్యక్షులు: మాదివాడ మోక్షశ్రీ, బేతి రాజా రెడ్డి, రచ్చ చక్రధర్, సురేంద్ర కుమార్ యాదవ్. సహ కార్యదర్శి: కె వి గోపాల కృష్ణంరాజు, సహ కోశాధికారి: బండి చంద్రశేఖర్, సాంస్కృతిక విభాగ సంయోజక్: యన్నపు లక్ష్మీకాంత్, సహ సంయోజక్: గంపా ప్రభాకర్ సమావేశంలో సత్య కాటేపల్లి, శిష్టా రామకిశోర్, అమరనాథ్, వి గంగాధర రావు, మువ్వల శ్రీనివాస రావు, అరుణ, అమర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పెంచిన గ్యాస్ ధర తక్షణమే తగ్గించాలి: కంచర్ల జమలయ్య



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:ఇరాన్ పై యుద్ధం కారణంగా పెరిగిన గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్యాస్ అందుబాటులో లేనందున ప్రజలు కట్టెల పొయ్యికి అలవాటు పడే పరిస్థితి వచ్చిందన్నారు. కొంతమంది దళారులు గ్యాస్ సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. పేద ప్రజల గ్యాస్ కొనలేక, కట్టెలు లేక పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కొరతని నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిత్యావసర వస్తువులను రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులు ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## 29న ఏకలవ్యలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష: ప్రిన్సిపల్ ఏ. విజయ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరం ఏకలవ్య ఆదర్శ పాఠశాల (ఈఎంఆర్ఎస్)లో 6వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 29న (ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ ఏ. విజయ తెలిపారు.పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈఎంఆర్ఎస్ వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు సమయపాలన పాటించాలని కోరారు.అడ్మిట్ కార్డులో పేర్కొన్న చిరునామాను ముందుగానే సరిచూసుకుని, ఒరిజినల్ అడ్మిట్ కార్డు, ఆధార్ కార్డు వంటి గుర్తింపు పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఈఎంఆర్ఎస్ పాఠశాల పాల్వంచలో కాకుండా రామవరం గ్రామంలోని పంజాబ్ గడ్డ ప్రాంతంలో, కృషి విజ్ఞాన్ కేంద్రం పక్కన ఉందని, తల్లిదండ్రులు గమనించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సతీష్ కుమార్ ఎన్నిక



నల్గొండ, ప్రజాస్ఫూర్తి, : నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన దర్శనం నరసింహపై 181ఓట్ల తో గెలుపొందారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా పజ్జురుస్వామి గౌడ్, ఏ సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బచ్చనబోయిన అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సూర్య పెల్లి అమరావతి, కోశాధికారిగా ఎండి ఫిరోజ్, క్రీడా కార్యదర్శిగా నారా బోయిన ప్రసన్నకుమార్, లైబ్రరీ సెక్రటరీగా పూల పోయిన రామకృష్ణ, లు ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా మిరియాల భాగ్యమ్మ, దువ్వ గీత, పులిజాల కార్తీక్, కే నగేష్ కుమార్, మేడి ప్రగతి, జై రాములు, పందుల సైదులు, జి వెంకట్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సయ్యద్ జమాల్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా బి రవి ఏ వెంకటరెడ్డి లు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు.

## పరిసరాలను పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

* **ఉప కమీషనర్ చాముండేశ్వరి**



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆల్విన్ కాలనీ సర్కిల్ ఉప కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ లో బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తో కలసి పర్యటించిన చాముండేశ్వరి నిత్యం ఇంట్లో పేరుకుపోతున్న చెత్తను, చెత్త తరలించే కార్మికుల రిక్షాల్లో మాత్రమే వేయాలని సూచించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తూ పారిశుధ్య సమస్యకు కరణమవుతున్న వారిని గుర్తించి వారిపట్ల చార్యలు, అదే విధంగా భారీ జరిమానా విధిస్తామని ఉప కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు హన్మంత్ రావు , ఎస్ఆర్పి చైతన్య, రాములు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాలు దేవాదాయ శాఖనే అధికారికంగా నిర్వహించాలి

* **33 వ వార్డు కౌన్సిలర్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి.**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో 27 న జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ప్రభుత్వం, దేవదాయ శాఖనే నిధులు కేటాయించి అధికారికంగా నిర్వహించాలని 33 వ వార్డు కౌన్సిలర్, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారది రెడ్డి డిమాండ్.చేశారు, ఈ సందర్బంగా గుడిని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల, అధికారుల తీరు వల్లనే గత 5 ఏండ్లుగా గాంధీపార్క్ లో కాకుండా రోడ్ పైనే సీతారాముల కళ్యాణం జరుగుతుందని అన్నారు. నూతన కూరగాయలు మార్కెట్ ప్రారంభించి కూడా ఇలా చేయడంశోచనీయం అన్నారు.. అరకొరనిధులు, దాతలు ఇచ్చే నిధులు కాకుండా భద్రాచలం తర్వాత అంత పెద్దగాజరిగే మానుకోట జిల్లా కేంద్రం లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ నే నిధులు కేటాయించి జరపాలన్నారు,, దూప దీప నైవేద్యలకు మరియి గుడి అభివృద్ధి కి, భక్తుల అవసరాలకు వాష్ రూమ్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలన్నారు ఆలయ అభివృద్ధి కి మెయింటెన్స్ కు షాప్స్ నిర్మించి అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు కౌన్సిలర్ రేష పల్లి నవీన్, పెరుగు కుమార్, తండ సందీప్, నీలం వెంకటేశ్వర్లు, బానోత్ లింగ్య నాయక్, బండి వెంకట్రామ్ నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు

## దక్షిణ అయోధ్య భద్రాద్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

**– మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భక్త రామదాసు నిర్మించిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ''దక్షిణ అయోధ్య''గా ప్రసిద్ధి చెందినదని, ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. గురువారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వివిఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద ప్రజల పాలిటా వరమని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. గురువారం మంజూరైన 8,98,000 విలువగల చెక్కులను ఆయన బాధితులకు షాద్ నగర్ ఎమ్మెల్సీ కార్యాలయంలో స్థానిక ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందింపజేశారు. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మాజీ వైస్ ఎంపీపీ హరికృష్ణ గౌడ్,కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,వీర్లపల్లి సర్పంచ్ పాండు,కందివనం సర్పంచ్ అమృనాయక్,మెల్లగూడ సర్పంచ్ మంగ రవి నాయక్,శేరిగుడ మాజీ సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి,మధురాపూర్ మాజీ సర్పంచ్ రంగయ్య గౌడ్,మొగిలిగిద్ద మాజీ ఎంపిటిసి రాధాకృష్ణ,విఠ్యల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్,పెద్ద చిలకమర్రి సర్పంచ్ శ్రీశైలం,కాంటెస్టెడ్ కౌన్సిలర్ రాజెందర్ సింగ్, ప్రముఖ వేదపండితులు భానుశర్మ, పులిచర్ల కుంట తండా ఉపసర్పంచ్ గణేష్,కొండనగూడ ఉపసర్పంచ్ అంజయ్య గౌడ్,సోలిపూర్ మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్,విలేజ్ ప్రెసిడెంట్ రమేష్ యాదవ్,బీఆర్ఎస్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి,వెంకటేష్ గౌడ్, మేకల రాజు, రాజు యాదవ్,శంకరయ్య గౌడ్,రమేష్ ముదిరాజ్,నరేష్,పాండు నాయక్,అన్వారీ రాజు, వెంకట్ రెడ్డి మల్లేష్ బాలకృష్ణ నాగరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలని కిసాన్ మోర్చా కలెక్టర్ కు వినతి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రైతు సమస్యలపై నల్లగొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించారు. ముఖ్యంగా రైతు భరోసాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అలాగే పెండింగ్ లో ఉన్న రైతు భరోసా డబ్బులు కూడ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చెయ్యాలని, వరి కోతలు ప్రారంభం కానున్నందున ఏప్రిల్ నెలలోనే ఐకెపి సెంటర్లు ప్రారంభించాలని, పెండింగ్ లో ఉన్న బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చెయ్యాలని, ఫామాయిల్ ఫ్యాక్టరీ పనులు సత్వరమే పూర్తి చెయ్యాలని అలాగే వి బి జి రాంజీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చెయ్యాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బస్వా లక్ష్మీ నర్సయ్య ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ నాగం వర్షిత్ రెడ్డి గారు కిసాన్ మోర్చా జాతీయ నాయకులు శ్రీ గోలి మధుసూదన్ రెడ్డి బీజేపీ సెంట్రల్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ శ్రీ వీరెల్లి చంద్రశేఖర్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదగోని శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర భూ నిర్వాసితుల సెల్ కన్వీనర్ భవనం మధుసూదన్ రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డికిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మత రెడ్డి అశోక్ రెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా నవీన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీజేపీ 1 వ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటేశం , బీపంగి జగ్జీవన్ ,పిండి పాపిరెడ్డి,మహిళా మోర్చా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ కిసాన్ మోర్చా సీనియర్ నాయకురాలు ఇరిగి చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు

## పంచశీల స్కూల్ లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు శ్రీరామ నవమి విశిష్టతను చాటి చెప్పేలా వేషధారణ ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరామ నవమి ప్రాముఖ్యతను; రామ తత్వాన్నీ ; రామాయణ గ్రంథ విశిష్టత విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మీడియా సహకారం.. సామాన్యుడికి న్యాయం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : వాసవి నగర్ కాలనీలోని గోపి స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన 9వ తరగతి విద్యార్థి సూరజ్ కుమార్ (14) కుటుంబానికి ఎట్టకేలకు న్యాయం లభించింది. ఈ ఘటనను వెలుగులోకి తీసుకురావడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కీలక పాత్ర పోషించగా, బిఆర్ఎస్ నాయకుడు గోగికార్ శివకుమార్ పట్టుదలతో సాగించిన పోరాటం ఫలించింది. సూరజ్ కుమార్ మృతి అనంతరం మీడియా వేగంగా స్పందించి బాధిత కుటుంబం గోడును సమాజానికి తెలియజేసింది. దీంతో ప్రజల్లో అవగాహన పెరిగి, అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. మీడియా మిత్రులకు శివకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.శివకుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిర్వహించిన ధర్నాకు మీడియా విస్తృత కవరేజ్ ఇవ్వడంతో యాజమాన్యం స్పందించాల్సి వచ్చింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.అంతేకాకుండా, ఆర్థికంగా వెనుకబడిన బాధిత కుటుంబానికి ₹3 లక్షల సహాయం అందేలా శివకుమార్ చొరవ తీసుకున్నారు. బలహీన వర్గాల పక్షపాతిగా తాను ఎప్పుడూ బాధితులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

## రామేశ్వరం దేవాలయంలో హుండీ లెక్కింపు

* **ఆరు నెలల హుండీ ఆదాయం రూ.935070**



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలో గల ఫరూక్ నగర్ మండలం రామేశ్వరం గ్రామ చారిత్రాత్మక దేవాలయం హుండీని గురువారం లెక్కింపు కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివకుమార్ ఆధ్వర్యంలో భక్తులు పలువురు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉండి లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది. హుండీ లెక్కింపులో ఆరు నెలలుగా దేవాలయానికి వచ్చిన ఆదాయం రూ. 9 లక్షల 35 వేల 70 రూపాయలు వచ్చిందనీ ఆలయ ఈఓ శివకుమార్ స్పష్టం చేశారు.

## టీఆర్ఈటీఏ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నిక

.జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సూరారంలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా ఎల్.మాణిక్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.అంజయ్య, వై.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా టీ.అంజయ్య గౌడ్, జాయింట్ సెక్రటరీగా ఎం.ఎ.రసూల్, అశోక్, కోశాధికారిగా జి.మల్లేష్, అర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.జగదీశ్వర్ రెడ్డి, సలహదారులుగా ఎం.డి.అఫ్సర్, .జగన్నాథంలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు, రాష్ట్ర అధ్యక్షులు పి.ఎస్.వినోద్ కుమార్, సెక్రటరీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి వేడుకలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

* **డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల పర్యవేక్షణలో భద్రాచలం పట్టణం**
* **2000 మంది పోలీసులతో ప్రత్యేక నిఘా : ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాచలంలో శుక్రవారం జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, శనివారం నాడు జరగనున్న పట్టాభిషేకం మహోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. సుమారు 2 వేల మంది పోలీసులతో, ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తుల కొరకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, ఆన్లైన్ లింకును రూపొందించడం జరిగిందని చెప్పారు. భద్రాచలం పట్టణం మొత్తం డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలతో నిరంతర పర్యవేక్షణలో ఉంటుందని అన్నారు. భద్రాచలం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ రెండు రోజులపాటు పోలీసు వారు విధించే ట్రాఫిక్ ఆంక్షలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.

* **డీజీపీకి స్వాగతం పలికిన ఎస్పీ**

భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి కిSజిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్మడ్ రిజర్వ్ పోలీసుల నుండి డీజీపీ గౌరవ వందనాన్ని స్వీకరించారు.

# హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎస్.సురేందర్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన ప్రత్యర్థి చిక్కుడు ప్రభాకర్‌పై 275 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా డి.ఎల్.పాండు 1,227 ఓట్లతో గెలుపొందారు. కార్యదర్శులుగా పి.శ్రావణ్‌కుమార్‌గౌడ్, కె.నిరంజన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా మహిళల రిజర్వేషన్‌లో పి.కృష్ణకీర్తన, కోశాధికారిగా బాలాజీ బానోత్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా విష్ణువర్ధన్ జయసూర్య, వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# కుషాయిగూడ పీహెచ్‌సీలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

* **99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహణ**
* **384 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా భారీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ముఖ్యంగా మహిళల కోసం ప్రత్యేక వైద్య బృందం సేవలు అందించగా, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు.అలాగే ఎముకలు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న వారికి ఆర్థోపెడిక్ నిపుణులు చికిత్స అందించగా, చిన్నారులకు పెడియాట్రిషన్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కంటి మరియు దంత వైద్యులు కూడా సేవలు అందించి రోగులకు అవగాహన కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ శిబిరంలో కుషాయిగూడ, జమ్మిగడ్డ మరియు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మొత్తం 384 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు డాక్టర్ రమాదేవి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య బృందం కోరింది.

# భలే భద్రగిరి మార్ట్... గిరిజన ఉత్పత్తులకు కొత్త వేదిక



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో గిరిజన ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్‌గా "భద్రగిరి మార్ట్" సిద్ధమైంది. గ్రామీణ జీవనోపాధికి బలం చేకూర్చే ఈ వినూత్న కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఐఏఎస్ ఆవిష్కరించారు. గిరిజన స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే ఈ మార్ట్ ప్రధాన లక్ష్యం.

**గిరిజన బజార్‌కు కొత్త రూపం**

భద్రాచలం పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో గతంలో గిరిజన బజారుగా ఉన్న భవనాన్ని ఆధునికంగా మలిచారు. ఐటీడీఏ నిధులతో అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దిన ఈ మార్ట్, పట్టణ నడిబొడ్డున వినియోగదారులకు అందుబాటులోకి రానుంది.

**విస్తృతంగా గిరిజన ఉత్పత్తులు**

ఈ మార్ట్‌లో అడవిలో లభించే సహజ వనరులతో తయారైన అనేక ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. వెదురు వస్తువులు, అటవీ తేనె, అడవి పసుపు, పచ్చళ్ళు, స్నాక్స్, హస్తకళలు, హెర్బల్ సబ్బులు, చిరుధాన్యాలు, కిరాణా వస్తువులు తదితరాలు సరసమైన ధరలకు విక్రయించనున్నారు.

**శ్రీరామనవమి నుంచి ప్రారంభం**

శ్రీరామనవమి సందర్భంగా ఈ మార్ట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. స్థానికులకు నాణ్యమైన ఉత్పత్తులు ఒకేచోట లభించడంతో పాటు, గిరిజనులకు ఆదాయ వనరులు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

**అభివృద్ధికి మరో అడుగు**

భద్రాచలంలో గిరిజన మ్యూజియం విజయవంతం చేసిన రాహుల్ ఐఏఎస్, ఇప్పుడు భద్రగిరి మార్ట్ ద్వారా గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నారు. విద్య, సంస్కృతి, వ్యవసాయం రంగాల్లో పలు కార్యక్రమాలు చేపడుతూ గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు. భద్రగిరి మార్ట్ ప్రారంభంతో గిరిజన ఉత్పత్తులకు కొత్త మార్కెట్ లభించడంతో పాటు, ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి. స్థానికంగా ఇది మరో ఆకర్షణగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు భాగస్వామ్యం కావాలి

* **జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ శంకర్ సింగ్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు భాగస్వామ్యం కావాలని జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ శంకర్ సింగ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 21వ రోజు గురువారం జీడిమెట్ల సర్కిల్ 55 పరిధిలోని మహేంద్ర నగర్, ద్వారకనగర్, కుత్బుల్లాపూర్ విలేజ్ ప్రాంతాలలో విడిచిపెట్టబడిన వాహనాలను , మట్టిని తొలగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన ప్రజా ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా వదిలివేయబడిన పాత వినియోగంలో లేని వాహనాలను గుర్తించి , మట్టిని తొలగించారు. ఈ చర్యల ద్వారా రహదారులపై ట్రాఫిక్‌కు అడ్డంకులు తొలగించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అనంతరం డీసీ మాట్లాడుతూ ప్రజలు తమ వాహనాలను ప్రజా ప్రదేశాల్లో విడిచిపెట్టకుండా సహకరించాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు భాగస్వామ్యం కావాలని అధికారులు కోరారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారితో సమావేశం నిర్వంచి వారి యొక్క సహకారంతో కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు భాగస్వామ్యం కావాలని అధికారులు కోరారు.

# అసెంబ్లీ జరుగుతుంటే ఆటలేంటి? సభ నడపడం చేతకాకనే క్రీడల సాకు: కేటీఆర్ సెటైర్లు

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు అత్యంత కీలక దశకు చేరుకున్న సమయంలో, ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ (BRS) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) తీవ్ర విమర్శలు గుప్పించారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్టిగా (చిట్ చాట్) మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ తీరుపై సెటైర్లు వేశారు. "అసెంబ్లీని హుందాగా నడపడం చేతకాదు కానీ.. ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు మాత్రం కావాలి" అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా, ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

**ప్రజలు ఏమనుకుంటారు?**

రాష్ట్రంలో సాగునీరు (ఇరిగేషన్) వంటి అత్యంత ముఖ్యమైన సబ్జెక్టులపై సభలో ఇంకా లోతైన చర్చ జరగాల్సి ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. "ఇంత సీరియస్‌గా సభ జరుగుతున్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ఏంటి? ప్రజా సమస్యలపై పోరాడాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలు ఆడుతుంటే చూస్తున్న ప్రజలు ఏమనుకుంటారు?" అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.



**సమాధానం లేని మంత్రి శ్రీధర్ బాబు**

కీలకమైన పద్దులపై చర్చను పక్కన పెట్టేందుకే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ కొత్త ఎత్తుగడ వేసిందని కేటీఆర్ ఆరోపించారు. మార్చి 28, 29 తేదీల్లో ఈ క్రీడా పోటీలను నిర్వహించాలని నిర్ణయించడం వెనుక ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడమే కారణమన్నారు. ఇదే విషయాన్ని తాను రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లానని, కానీ ఆయన వద్ద తన ప్రశ్నకు ఎలాంటి సమాధానం లేదని కేటీఆర్ వెల్లడించారు.

**పారిపోవాలని చూస్తున్నారు..**

ప్రభుత్వం ప్రజా సమస్యల పట్ల పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు సంధించే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, పద్దులపై చర్చను ఏమాత్రం సమయం కేటాయించకుండా త్వరగా ముగించి పారిపోవాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ క్రీడా పోటీలను ఒక సాకుగా చూపిస్తోందని కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు.

**కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడి పుట్టినరోజునే మనం 'శ్రీరామనవమి'గా జరుపుకొంటాం. ఇందులో భాగంగా బెల్లం పానకం, వడపప్పు, చలిమిడి.. మొదలైనవి దేవునికి నైవేద్యంగా సమర్పిస్తాం. ఆ తర్వాత వీటిని ప్రసాదంగా పంచిపెడతాం. ఈ క్రమంలో వీటి తయారీ విధానం, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం రండి..**

# నవమి నైవేద్యం.. ఆరోగ్యానికీ..!

**బెల్లం పానకం..**

**కావాల్సిన పదార్థాలు**

* బెల్లం ఒక కప్పు
* నీరు నాలుగు కప్పులు
* మిరియాల పొడి చెంచా
* యాలకుల పొడి అర చెంచా
* అల్లం పొడి పావు చెంచా

**తయారీ విధానం**

ముందుగా నీటిలో బెల్లాన్ని వేసి కరిగించాలి. బెల్లం పూర్తిగా కరిగిన తర్వాత వడకట్టి పక్కన పెట్టుకోవాలి. ఈ మిశ్రమంలో మిరియాల పొడి, యాలకుల పొడి, అల్లం పొడి.. మొదలైన పదార్థాలన్నీ వేసి కలుపుకోవాలి. అంతే.. రుచికరమైన తియ్యతియ్యటి బెల్లం పానకం రడీ..!

**ఆరోగ్యానికి మేలు!**

నైవేద్యానికి నవగాయ పిండివంటలు లేకపోయినా, అవి వండడానికి ఒంట్లో ఓపిక లేకపోయినా ఇంట్లో చిన్న బెల్లం ముక్క ఉంటే చాలంటారు పెద్దలు. అందుకే నైవేద్యంలో బెల్లాన్ని ఉపయోగిస్తాం. దీనివల్ల కేవలం నోటికి రుచే కాకుండా.. అనేక రకాల పోషకాలు కూడా శరీరానికి అందుతాయి అంటున్నారు నిపుణులు.

* బెల్లంలో ఐరన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పొటాషియం, శరీర ఎదుగుదలకు కావలసిన ఇతర ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి.
* శరీరానికి తక్షణ శక్తిని అందించడానికి బెల్లం బాగా ఉపయోగపడుతుంది. కాబట్టి ఎప్పుడైనా అలసటగా అనిపించినప్పుడు ఓ బెల్లం ముక్కను నోట్లో వేసుకుంటే అలసట మాయమవుతుందంటున్నారు నిపుణులు.
* బెల్లంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనత బారిన పడకుండా కాపాడుతుంది.
* ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు.. శరీరానికి హాని కలిగించే ఫ్రీరాడికల్స్ వల్ల కణజాల వ్యవస్థ దెబ్బతినకుండా కాపాడతాయి.
* బెల్లం సహజసిద్ధమైన క్లెన్సింగ్ ఏజెంట్‌లా పని చేస్తుంది.



**వడపప్పు**

**కావాల్సిన పదార్థాలు**

* పెసరపప్పు ఒక కప్పు
* తురిమిన కొబ్బరి మూడు చెంచాలు
* చిన్న చిన్న ముక్కలుగా చేసిన పచ్చిమిర్చి కొన్ని
* నిమ్మరసం చెంచా
* ఉప్పు రుచికి తగినంత
* కొత్తిమీర గార్నిష్ కోసం

**తయారీ విధానం**

ముందుగా పెసరపప్పును అరగంట పాటు నానబెట్టాలి. తర్వాత నీరు వడకట్టుకుని పక్కన పెట్టుకోవాలి. ఈ పప్పులో పైన చెప్పిన ఇతర పదార్థాలన్నీ వేసి బాగా కలుపుకోవాలి. అంతే.. వడపప్పు రడీ!

**ప్రయోజనాలు**

* పెసరపప్పులో శరీరంలోని అవయవాల పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమయ్యే విటమిన్ బి, ఇ; క్యాల్షియం, పొటాషియం, ఐరన్.. వంటి పోషకాలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి.
* బరువు తగ్గాలనుకునే వారికి పెసరపప్పు మంచి ఆహారం. ఇందుకు కారణం దీనిలో తక్కువ మోతాదులో ఉండే కొవ్వు పదార్థాలే. అలాగే పెసరపప్పులో అధికంగా ఉండే ప్రొటీన్, ఫైబర్.. వంటివి రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గించేందుకు సహకరిస్తాయి.
* ఈ పప్పులో ఉండే యాంటీఆక్సిడెంట్ గుణాలు, ఇతర ఖనిజాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహకరిస్తాయి.
* జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడానికి పెసరపప్పు బాగా తోడ్పడుతుంది.

అలాగే బియ్యప్పిండి, బెల్లం కలిపి చలిమిడిని తయారు చేస్తారు. ఇవన్నీ వేడిని తగ్గించేవే.. అందుకే వేసవి తాపానికి గురికాకుండా ఉండేందుకు వీటిని తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఏడుగంటలు గాల్లో.. సౌదీ గగనతలం నుంచి ఎయిరిండియా విమానం యూటర్న్

దేశ రాజధాని ఢిల్లీ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం ఏడుగంటల పాటు గాల్లోనే ఉండాల్సి వచ్చింది. చివరకు బయల్దేరిన చోటే ల్యాండ్ అవ్వాల్సి వచ్చింది. సాంకేతిక కారణంతో సౌదీ అరేబియా గగనతలం నుంచి అది వెనుతిరగాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రోజు ఉదయం 6.13 గంటల సమయంలో ఢిల్లీ నుంచి బయల్దేరిన ప్రయాణికుల విమానం లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ సౌదీ అరేబియా గగనతలంలోకి




ప్రవేశించిన తర్వాత అది వెనుతిరిగి, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మళ్లీ ఢిల్లీలో ల్యాండ్ అయింది . ఫ్లైట్‌రాడార్ డేటా ప్రకారం.. అప్పటికే అది 3,300 కి.మీ. ప్రయాణించింది. సౌదీ నుంచి లండన్‌కు వెళ్లాలంటే ఆరు నుంచి ఏడు గంటల సమయం పడుతుంది. అయితే ఇలా అకస్మాత్తుగా వెనుతిరగడానికి సాంకేతిక సమస్య కారణమని తెలుస్తోంది. ''ఎయిరిండియా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. అయితే ప్రస్తుతం సాంకేతికంగా పూర్తిస్థాయి తనిఖీలు చేస్తున్నాం. అవి పూర్తవడానికి కొంచెం సమయం పడుతుంది'' అని విమానయాన సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. విమానంలో శబ్దాలు వినిపించడం వల్లే వెనక్కి మళ్లించినట్లు సమాచారం. పది రోజుల క్రితం ఇదే విమానాన్ని దారిమళ్లించారు. మార్చి 15న ఢిల్లీ నుంచి న్యూయార్క్ బయల్దేరిన విమానాన్ని ఐర్లాండ్‌కు మళ్లించడం గమనార్హం. అప్పుడు సాంకేతిక సమస్యే కారణమని సంస్థ వెల్లడించింది.

### 'ఏఐ' తీర్పుల ప్రస్తావన..

# సుప్రీం కోర్టు ఆందోళన

కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన తీర్పులను.. కక్షిదారులు,న్యాయవాదులు ఉటంకిస్తున్న తీరుపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఈ సమస్య అంతకంతకూ పెరుగుతోందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది.



**అసలేం జరిగింది..?**

ఓ కంపెనీ డైరెక్టర్‌కు సంబంధించిన కేసును గతంలో బాంబే హైకోర్టు విచారించింది. ఇందులో భాగంగా ఆ డైరెక్టర్ దాఖలు చేసిన రాతపూర్వక అంశాలను పరిశీలించి.. చాట్‌జీపీటీ, లేదా అటువంటి ఏఐ టూల్స్‌ను ఉపయోగించి రూపొందించినట్లు భావిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఓ కేసును కూడా ప్రస్తావించారని, అయితే.. దాని ప్రతిని అందించలేదని తెలిపింది. దాని గురించి తెలుసుకునేందుకు కోర్టు సిబ్బంది ప్రయత్నించినా.. ఫలితం లేకపోయిందని చెప్పింది. దీంతో విలువైన కోర్టు సమయం వృథా అయ్యిందని పేర్కొంది. అయితే, చాట్‌జీపీటీ ఉపయోగించారంటూ బాంబే హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొన్న వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ కంపెనీ డైరెక్టర్.. సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లోనూ ఇటువంటి సమస్య ఉందని పేర్కొంది. ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

# స్టేడియానికి భూములిచ్చినా.. వాళ్లు టికెట్లు ఇవ్వట్లేదు!

ఐపీఎల్ సీజన్ ప్రారంభంకానున్న వేళ.. టికెట్ల కేటాయింపులో కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ వ్యవహరిస్తున్న తీరుపై అక్కడి ఎమ్మెల్యేలు తీవ్ర విమర్శలు గుప్పించారు. చట్టసభ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు కేఎస్‌సీఏ టికెట్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. తాము వీఐపీలమని, క్యూలో నిలబడే ప్రసక్తే లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రీమియం టికెట్లు ఇవ్వాలని, చట్టసభ సభ్యుల కోసం స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ''మార్చి 28న ఐపీఎల్ మ్యాచ్ జరగనుంది. మంత్రులు, ఎమ్మెల్యేలకు కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ టికెట్లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి వాళ్లు అన్ని





సౌకర్యాలు పొందుతున్నప్పటికీ.. ఎమ్మెల్యేలకు మాత్రం కనీస గౌరవం ఇవ్వడం లేదు. బ్లాక్ మార్కెట్‌లో టికెట్లు విక్రయిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు'' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద శివశంకరప్ప ఆరోపించారు. అంతకుముందు ఇదే అంశంపై అసెంబ్లీలో విపక్ష నేత భాజపా ఎమ్మెల్యే ఆర్ అశోకా మాట్లాడుతూ.. రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్టేడియం కోసం వారికి నామమాత్రపు ధరకే భూమిని కేటాయిస్తే.. వాళ్లు మాత్రం టికెట్ల రూపంలో తమనుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, వాళ్లకు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ విషయంలో విపక్ష ఎమ్మెల్యేలను సమర్థిస్తున్నానని అధికార పార్టీ నేత శివశంకరప్ప చెప్పారు. తాము ప్రముఖులమని (VIP), క్యూలైన్లలో వెళ్లి నిలబడలేమన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరిన ఆయన.. ఒక్కో ఎమ్మెల్యేకు ఐదు టికెట్లు ఇప్పించాలన్నారు. స్పీకర్ యూటీ ఖాదర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశంలో జోక్యం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఎమ్మెల్యేలకు ఒక్కోసారి ఒక్క టికెట్ మాత్రమే ఇచ్చిన ఘటనలు ఉన్నాయన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బదులిస్తూ.. ఈ విషయాన్ని అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# 'వందేభారత్' భోజనంలో పురుగులు.. IRCTCకి రూ.10 లక్షల జరిమానా

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో(Vande Bharat Express) అందించిన ఆహారంలో పురుగులు కన్పించడం తీవ్ర వివాదాస్పదమైంది. తమకు ఇచ్చిన భోజనంలో పురుగులు ఉన్నాయంటూ రితేష్‌కుమార్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన రైల్వేశాఖ.. ఐఆర్‌సీటీసీకి (IRCTC) జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. రితేశ్‌కుమార్ మార్చి 15న పట్నాటాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో తమకు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు రావడంతో ఆయన కంగుతిన్నారు. వెంటనే మేనేజర్‌ని పిలిచి ఫిర్యాదు చేశారు. రైలు సిబ్బంది ఆ భోజనాన్ని పరిశీలించారు. ఇదంతా రితేశ్ వీడియో తీసి సోషల్ మీడియాలో(Social media) పోస్ట్ చేశారు. ఇదికాస్తా వివాదాస్పదం కావడంతో రైల్వే మంత్రిత్వశాఖ ఎక్స్‌లో స్పందించింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు వెల్లడించింది.



ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానాతో పాటు అతడి కాంట్రాక్టును రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, రైల్వే సౌకర్యాల్లో నాణ్యతే తమ ప్రథమ ప్రాధాన్యమని రైల్వేశాఖ వివరించింది.

# బంకుల్లో రద్దీ.. బైక్‌ను వదిలి గుర్రంపై ఆఫీసుకు!

ఇంధనం కొరత ఉందంటూ వదంతులు రావడంతో పెట్రోల్, డీజిల్ కోసం బంకుల వద్ద జనం ఎగబడుతున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు ఉద్యోగి కొత్త మార్గాన్ని ఎంచుకున్నాడు. తన గుర్రంపై స్వారీ చేసుకుంటూ కార్యాలయానికి వెళ్లడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లోని దేవాస్ నగరానికి చెందిన గోపాల్ ఠాకుర్.. ప్రైవేటు బ్యాంకులో కలెక్షన్ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. ఇంటి



నుంచి మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆఫీస్‌కు నిత్యం బైక్‌పై వెళ్లేవాడు. ఇటీవల పెట్రోల్ బంకులు కిక్కిరిసిపోవడం చూసి దానిని పక్కన పెట్టేసిన ఆయన.. తన గుర్రాన్ని ప్రయాణ సాధనంగా మార్చుకొన్నాడు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆఫీస్‌కు సమయానికి చేరుకున్నాడు. ఇది గమనించిన తోటి ఉద్యోగులు, స్థానికులు ఈ దృశ్యాన్ని కెమెరాల్లో బంధించారు.

# వార్ ఎఫెక్ట్.. దేశంలో ఊపందుకున్న పర్యటకం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల్లో పర్యటక రంగానికి బ్రేక్ పడింది. యుద్ధం వేళ ఆయా దేశాలకు వెళ్లేందుకు పర్యటకులు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే భారతీయులు కూడా గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు చేసుకొన్న తమ వేసవి విహారయాత్రలను రద్దు చేసుకుంటున్నారు. దీంతో మన దేశంలోని టూరిస్టు ప్రాంతాలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాలు స్వదేశీ పర్యటకానికి ఊతమిస్తున్నాయి. వేసవి సెలవుల్లో అమెరికా, ఐరోపా దేశాలను సందర్శించేందుకు ఇప్పటికే ప్రణాళిక వేసుకొన్న టూరిస్టులు పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి భయపడి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ పర్యటక ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు. లద్దాఖ్, రిషికేశ్, శిమ్లా, మనాలీ, షిల్లాంగ్ వంటి శీతల ప్రదేశాలను వేసవిలో సందర్శించేందుకు



ఆసక్తి చూపిస్తున్నారు. పర్యటకుల్లో దాదాపు 65% మంది దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్ వంటి ప్రాంతాలకు గతంతో పోలిస్తే ఇప్పుడు 30శాతం బుకింగ్‌లు పెరిగాయి. 23శాతం మంది ఆధ్యాత్మిక(spiritual) పర్యటనలకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే విదేశీ పర్యటనలకు వెళ్లాలనుకునేవారు ఎక్కువగా వియత్నాం, నేపాల్, శ్రీలంక, ఇండోనేసియా, సింగపూర్, థాయ్‌లాండ్‌లను ఎంచుకుంటున్నట్లు ట్రావెల్ ఏజెన్సీల గణాంకాలను బట్టి తెలుస్తోంది.



# 'కార్బన్ గార్డెన్'..
## వాయు కాలుష్యానికి వినూత్న పరిష్కారం!

ఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆయా నగరాలను వాయు కాలుష్యం వేధిస్తోంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ క్రమంలోనే ఢిల్లీ యూనివర్సిటీ.. దీనికి తక్కువ ఖర్చుతో కూడిన ప్రభావవంతమైన పరిష్కారం చూపింది. అదే 'కార్బన్ గార్డెన్'. యూనివర్సిటీలోని వృక్షశాస్త్ర విభాగ అధిపతి దీనబంధు సాహూ ఆధ్వర్యంలో 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. 50 రకాల మొక్కలతోపాటు శైవలాలు, శిలీంధ్రాలు, బ్యాక్టీరియాలతో కూడిన ఈ గార్డెన్.. కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను గ్రహిస్తుంది. ఈ మొక్కలు, సూక్ష్మజీవులు.. విష వాయువులను విచ్ఛిన్నం చేయడంతోపాటు నేలను పునరుజ్జీవింపజేస్తాయని సాహూ తెలిపారు. ఇదొక చిన్నపాటి జీవవైవిధ్య ఉద్యానవనంలా పనిచేస్తుందన్నారు. ఇటీవల వర్సిటీలో నిర్వహించిన ఓ జాతీయ సదస్సులో నిపుణులు ఈ నమూనాను ప్రశంసించారు. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, అధిక జనసాంద్రత కలిగిన నగరాల్లో విస్తరించేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

# నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా



నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ పార్లమెంటరీ నేతగా గురువారం ఎన్నికయ్యారు. దీంతో హిమాలయ దేశ ప్రధాని పగ్గాలు చేపట్టిన యువ నేతగా ఘనత సాధించనున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ఆయన.. మాధేశ్ ప్రాంతం నుంచి అత్యున్నత పీఠం అధిరోహించిన వ్యక్తిగానూ రికార్డు నెలకొల్పనున్నారు. సుదీర్ఘ కాలంగా రాజకీయ అనిశ్చితి ఎదుర్కొంటున్న నేపాల్‌లో.. జెన్‌జీ తిరుగుబాటు అనంతరం పరిణామాలు పూర్తిగా మారిపోయాయి. గత 18 ఏళ్లలో 14 ప్రభుత్వాలు మారిన ఈ హిమాలయ రాజ్యంలో.. యువనేత నేత బాలేంద్ర షా సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది.

**ఎవరీ బాలేంద్ర షా..?**

కాఠ్‌మాండూకు చెందిన బాలేంద్ర షాను బాలెన్ షాగా పిలుస్తుంటారు. వీరి కుటుంబం మాధేశ్ ప్రాంతం నుంచి రాజధానికి వచ్చి స్థిరపడింది. ఎప్పుడూ నలుపు కళ్లజోడులో కనిపించే బాలెన్ ఓ ర్యాపర్ కూడా. దేశంలో అస్థిర రాజకీయాలు, అవినీతినీ విమర్శిస్తూ పాడిన కవితలతో అనతికాలంలోనే యూత్ ఐకాన్‌గా మారారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం కాఠ్‌మాండూ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్ఎస్‌పీ తరపున పోటీ చేసి ప్రధాని పీఠం దక్కించుకున్నారు.

## వికటించిన ప్రొఫెసర్ ప్రేమ పాఠం

బెంగళూరు: బెంగళూరు గ్రామీణ జిల్లా నెలమంగలలోని ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఒకరు విద్యార్థుల చేతిలో దెబ్బలు తినాల్సి వచ్చింది. తరగతి గదిలోని వైద్య విద్యార్థినికి ఆయన ప్రేమ ప్రతిపాదన చేయడమే ఇందుకు కారణం. దీంతో ఆ విద్యార్థిని అక్కడే గట్టిగా వ్యతిరేకించి హెచ్చరించింది. ఈక్రమంలో తరగతి గదిలోంచి వెళ్లిపోతున్న ప్రొఫెసర్‌పై మిగతా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ కళాశాల కర్ణాటక హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర ఆధ్వర్యంలో కొనసాగుతుండటం విశేషం.

## ఇరాన్ చమురు కొనుగోలు వార్తలపై క్లారిటీ ఇచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్



**న్యూఢిల్లీ:** ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోలు చేసినట్లు తమపై వస్తున్న వార్తలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తీవ్రంగా ఖండించింది. ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవి అని కొట్టిపారేసింది. ఈ మేరకు గురువారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

సముద్ర మార్గంలో చిక్కుకుపోయిన ఇరాన్ ముడి చమురుపై అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా ఆంక్షలను సడలించడంతో, రిలయన్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకుందని పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ నుంచి రిలయన్స్ సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసిందని ఈ కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే రిలయన్స్ స్పందించింది.

"ఇరాన్‌కు చెందిన ముడి చమురును కంపెనీ కొనుగోలు చేసిందంటూ ఇటీవలి మీడియా నివేదికలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. ఈ నివేదికలు నిరాధారమైనవి. ప్రజలను తప్పుదారి పట్టించేలా, తప్పుడు వాదనలకు దారితీసేలా ఉన్నాయి" అని కంపెనీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వార్తలను ప్రచురించే ముందు సంబంధిత మీడియా సంస్థలు వాస్తవాలను ధృవీకరించుకోవాలని హితవు పలికింది.

గత వారం, అమెరికా ఆర్థిక శాఖ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నౌకల్లో నింపి, సముద్రంలో చిక్కుకుపోయిన ఇరాన్ చమురు అమ్మకానికి స్వల్పకాలిక అధికారాన్ని మంజూరు చేసింది. ఈ చర్య ద్వారా ప్రపంచ సరఫరాను వేగంగా పెంచవచ్చని, అదే సమయంలో టెహ్రాన్‌పై ఒత్తిడిని కొనసాగించవచ్చని డొనాల్డ్ ట్రంప్ పరిపాలన యంత్రాంగం భావిస్తున్నట్లు ఆర్థిక శాఖ పేర్కొంది.

అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, "ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఈ చర్య తీసుకున్నాం. మార్చి 20 నాటికి ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసిన చమురుకు మాత్రమే ఈ అధికారం వర్తిస్తుంది" అని తెలిపారు. ఏప్రిల్ 19 వరకు ఈ వెసులుబాటు అమల్లో ఉంటుందని ట్రెజరీ జనరల్ లైసెన్స్‌లో పేర్కొన్నారు.

ఈ నిర్ణయంతో సుమారు 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి అందుబాటులోకి వస్తుందని, సరఫరాపై ఒత్తిడి తగ్గుతుందని బెస్సెంట్ వివరించారు. ఆంక్షలు విధించిన ఇరాన్ చమురులో ఎక్కువ భాగం చైనా వంటి దేశాలు చౌకగా నిల్వ చేసుకుంటున్నాయని, ఈ తాజా నిర్ణయంతో టెహ్రాన్ ప్రాబల్యాన్ని తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల మధ్య తమపై వచ్చిన ఆరోపణలను రిలయన్స్ ఖండించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్..

### నిలిచిన బాస్మతి రైస్ ఎగుమతులు



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత బాస్మతీ రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటా దేశానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టే సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ఈ పరిశ్రమ, ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది.

యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు వెళ్లే సముద్ర మార్గాలు అత్యంత ప్రమాదకరంగా మారడంతో ఎగుమతులు దాదాపుగా నిలిచిపోయాయి. దీంతో సుమారు 10 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం భారత ఓడరేవుల్లోనే పేరుకుపోయింది. దీనికి తోడు, షిప్పింగ్ కంపెనీలు 'వార్-రిస్క్ సర్ ఛార్జ్' పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తుండటంతో రవాణా ఖర్చులు రెట్టింపయ్యాయి. ఇది ఎగుమతిదారులపై పెను భారంగా మారింది.

మరోవైపు, ఇప్పటికే ఎగుమతి చేసిన సరుకులకు సంబంధించి చెల్లింపులు కూడా ఆగిపోయాయి. ఇరాన్ వంటి దేశాల నుంచి రూ.2,000 కోట్ల నుంచి రూ.25,000 కోట్ల వరకు బకాయిలు నిలిచిపోయినట్లు అంచనా. అక్కడి బ్యాంకింగ్ వ్యవస్థలు సరిగ్గా పనిచేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామాల ప్రభావంతో దేశీయ మార్కెట్లలో బాస్మతీ ధర క్వింటాల్‌కు రూ.800 వరకు పడిపోయింది. ఇది పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తోంది.

భారత్ నుంచి ఎగుమతయ్యే మొత్తం బాస్మతీలో శాతం 70-75 సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ వంటి దేశాలకే వెళ్తుంది. ఈ అనిశ్చితి ఇలాగే కొనసాగితే, భారత మార్కెట్‌ను పాకిస్థాన్ వంటి పోటీ దేశాలు కైవసం చేసుకునే ప్రమాదం ఉందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నయారా ఎనర్జీ




**న్యూఢిల్లీ:** ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

## ఏప్రిల్ 13 నుంచి ఐపీఎల్

# రెండో దశ మ్యాచ్‌లు..



### సన్‌రైజర్స్‌ను ఢీకొట్టేది ఎవరంటే..!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరో రెండు రోజుల్లో ఆరంభం కానుంది. తొలి దశ మ్యాచ్‌లకు పది జట్లు సిద్ధమైన వేళ రెండో దశ షెడ్యూల్‌పై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడం, కెప్టెన్లతో సమావేశం పూర్తవ్వడంతో బీసీసీఐ(దీజజ×) రెండో దశ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 13 నుంచి రెండో విడత లీగ్ జరగనుండగా మే 24న జరిగే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. అయితే.. ప్లే ఆఫ్స్ తేదీలను మాత్రం వెల్లడించలేదు.

ఐపీఎల్ సందడికి మరో రెండో రోజులే ఉండడంతో బీసీసీఐ గురువారం కీలక ప్రకటన చేసింది. తొలి విడత ఐపీఎల్‌కు కొనసాగింపుగా రెండో దశ షెడ్యూల్‌ను వెల్లడించింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పాటు పది ఫ్రాంచైజీల కెప్టెన్లతో సమావేశం పూర్తి కావడంతో షెడ్యూల్‌పై కసరత్తు చేసిన బీసీసీఐ గురువారం మ్యాచ్‌ల జాబితా విడుదల చేసింది. ఏప్రిల్ 13 నుంచి రెండో దశ మ్యాచ్‌లు నిర్వహిస్తామని, మే 24న ఫైనల్ ఉంటుందని భారత బోర్డు తెలిపింది.

### ఎనిమిది డబుల్ హెడర్స్

రెండో దశలో 12 వేదికల్లో 50 మ్యాచ్‌లు జరుపుతామని బీసీసీఐ పేర్కొంది. వీటిలో ఎనిమిది డబుల్ హెడర్స్ ఉంటాయని, మధ్యాహ్నం 3:30 గంటలకు ఒకటి, రాత్రి 7:30 గంటలకు రెండో గేమ్ ఆడిస్తామని ఫ్రాంచైజీలకు భారత బోర్డు సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టం చేశాడు. అయితే.. ప్లే ఆఫ్స్ తేదీలను మాత్రం చెప్పలేదు.

రెండో దశలో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరుగనుంది. పంజాబ్ కింగ్స్ జట్టు తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్‌లో ఆడనుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు ధర్మశాలలో ఉంటాయి. రాజస్థాన్ సొంత గడ్డ అయిన జైపూర్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ చిన్నస్వామిలో మూడు, రాయ్‌పూర్‌లో రెండు మ్యాచ్‌లు ఆడనుంది.

రెండో దశ వేదికలు : హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్‌పూర్, న్యూ చండీగఢ్.

## ఐపీఎల్ 2026 ఓపెనింగ్

# సెర్మనీ లేనట్లే..




### మరో భారీ ప్లాన్ వేసిన బీసీసీఐ !

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్ శనివారం నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. అయితే ఓపెనింగ్ సెర్మనీ లేకుండానే ఈసారి ఆ మెగా టోర్నీని ప్రారంభించనున్నారు. బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియంలో హైదరాబాద్, బెంగుళూరు జట్ల మధ్య తొలి ఫైట్ జరగనున్నది. ఇక గత ఏడాది విక్టరీ పరేడ్ సమయంలో పెను విషాద ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆర్సీబీ జట్టు ర్యాలీకి వేల సంఖ్యలో జనం రావడంతో తొక్కిసలాట జరిగింది. ఆ ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఆ అభిమానుల స్మృతికి నివాళిగా ఈసారి ప్రారంభం వేడుకలను నిర్వహించడం లేదని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

సాంస్కృతిక, వినోద వేడుకలను చేపట్టడం లేదని ఆ అధికారి చెప్పారు. కానీ ఐపీఎల్ క్లోజింగ్ సెర్మనీ కోసం మాత్రం భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐతో పాటు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఘనంగా క్లోజింగ్ సంబరాలను నిర్వహించాలని భావిస్తున్నట్లు ఓ మీడియా తన కథనంలో రాసింది. 2025లో కోల్‌కతాలో ఓపెనింగ్ వేడుకలను గ్రాండ్‌గా నిర్వహించారు. షారూక్ ఖాన్, శ్రేయాస్ ఘోషల్, కరన్ అజులా ఆ కార్యక్రమంలో పాల్గొన్న విషయం తెలిసిందే.

## 'మేము వీఐపీలం..

## ఐపీఎల్ టికెట్ల కోసం క్యూలో నిల్చోవాలా'?

**ముంబై:** మరో రెండు రోజుల్లో ఐపీఎల్ సందడికి తెరలేవనుంది. స్టార్ ఆటగాళ్ల మెరుపులను కళ్లారా చూసేందుకు అభిమానులు టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. ఆన్‌లైన్‌లో కొందరు నిమిషాల్లో, మరికొందరు గంటలకొద్దీ క్యూలైన్లలో నిల్చొని మరీ టికెట్లు సంపాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు కొందరు బెదిరింపులకు దిగుతున్నారు. కర్నాటక ఎమ్మెల్యే తమకు ఐపీఎల్ టికెట్లు ఇవ్వాలని, మైదానంలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని రాష్ట్ర క్రికెట్ సంఘాన్ని ఆదేశించారు.




చిన్నస్వామి స్టేడియంలో శనివారం ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌తో ఐపీఎల్ మొదలవ్వనుంది. ఇప్పటికే మ్యాచ్ టికెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఈ పరిస్థితుల్లో కర్నాటక ఎమ్మెల్యే టికెట్ల కోసం డిమాండ్ చేశారు. హుంగుండ్ శాసనసభ్యుడైన విజయానంద్ కషపనవర్ గురువారం కర్నాటక క్రికెట్ సంఘానికి టికెట్ల గురించి కొన్ని ఆదేశాలిచ్చారు.

'మార్చి 28న ఐపీఎల్ మ్యాచ్ జరుగనుంది. ఎమ్మెల్యేలు, మంత్రులు, వారి కుటుంబ సభ్యులకు కర్నాటక క్రికెట సంఘం టికెట్లు ఇవ్వడం లేదు. కానీ, ప్రభుత్వం నుంచి కేఎస్‌సీఏ అన్నిరకాల ప్రయోజనాలు పొందుతోంది. అయినా కర్నాటక క్రికెట్ సంఘం ఎమ్మెల్యేలను మాత్రం గౌరవవించడం లేదు. అందుకని మేము ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాం.


ఐపీఎల్ టికెట్ల విషయాన్ని ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీలో లేవనెత్తారు. నేను వారి ప్రతిపాదనకు అంగీకరిస్తున్నా. ఎమ్మెల్యేలకు కనీసం ఐదు టికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరాను' అని విజయానంద్ తెలిపారు. అంతేకాదు మైదానంలో తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మేము వీఐపీలం. అందరిలా మేము ఐపీఎల్ టికెట్ల కోసం క్యూలో నిల్చోలేం. మేము గత సీజన్‌లో ఐపీఎల్ మ్యాచ్ చూసేందుకు వెళ్లాం. చాలాసేపు క్యూలో నిల్చున్నాం. సాధారణ ప్రజల మాదిరిగానే మమ్మల్ని గ్యాలరీలోకి పంపించారు. ఈసారి అలా జరగదు అని ఆయన కర్నాటక క్రికెట్ సంఘం తీరుపై విమర్శలు గుప్పించారు.

## హైదరాబాదీలకు గుడ్‌న్యూస్..

## ఉప్పల్‌లో టీమిండియా టీ20, వన్డే మ్యాచ్ ఖరారు..!

**న్యూఢిల్లీ:** రికార్డు స్థాయిలో మూడోసారి పొట్టి ప్రపంచకప్‌తో చరిత్ర సృష్టించిన భారత జట్టు ఐపీఎల్ తర్వాత బిజీగా ఉండనుంది. టీమిండియా 2026-27 సీజన్‌లో తీరిక లేకుండా మ్యాచ్‌లు ఆడనుంది. సొంతగడ్డపై వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ తలపడనుందని గురువారం బీసీసీఐ తెలిపింది. ఇవి మొత్తం 22 మ్యాచ్‌లు ఉండగా.. వీటిలో రెండింటికి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికవ్వనుంది. బెంగళూరు, గువాహటి, అహ్మదాబాద్, రాంచీలోనూ భారత జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది.

స్వదేశంలో అదిరే ఆటతో పొట్టి వరల్డ్‌కప్‌ను ముద్దాడిన టీమిండియా వచ్చే వన్డే ప్రపంచకప్‌లో భాగంగా ఈ ఏడాది కీలక మ్యాచ్‌లు ఆడనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ముఖ్యమైన ద్వైపాక్షిక సిరీస్‌లతో శుభ్‌మన్ గిల్ సేన ముందంజ వేయాలనే కసితో ఉంది. 2026-27 సీజన్ విషయానికొస్తే.. సొంతగడ్డపై 22 మ్యాచ్‌లతో ప్రేక్షకులను అలరించనుంది. మూడు ఫార్మాట్ల పరంగా చూస్తే 5 టెస్టులు, 9 వన్డేలు, 8 టీ20లు ఉన్నాయంతే. గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు దూరమైన హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో రెండు గేమ్స్ జరుగనున్నాయి.




ద్వైపాక్షికి సిరీస్ కోసం సెప్టెంబర్‌లో భారత్‌కు వెస్టిండీస్ జట్టు రాబోతుంది. మూడు వన్డేలు, ఐదు టీ20ల కోసం కరీబియన్ జట్టు సెప్టెంబర్ -- అక్టోబర్‌లో ఇండియాలో ఉండనుంది. తిరువనంతపురం, గువాహటి, న్యూ ఛండీగఢ్ మూడు వన్డేలకు వేదికలుగా ఎంపికయ్యాయి. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరులో భారత్, విండీస్ జట్లు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఈ సిరీస్ అనంతరం డిసెంబర్ 13 నుంచి 27 వరకూ శ్రీలంకతో మూడేసి వన్డేలు, టీ20లు ఆడనుంది టీమిండియా. ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లో వన్డేలు.. రాజ్‌కోట్, కటక్, పుణేలో పొట్టి క్రికెట్‌లో ఆతిథ్య భారత్‌ను లంక ఢీకొట్టనుంది. కొత్త ఏడాది(2027) ఆరంభంలో జింబాబ్వే జట్టు మూడు వన్డేల సిరీస్ కోసం ఇండియాకు రానుంది. వీటిలో ఒక మ్యాచ్‌కు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం ఎంపికవ్వగా.. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, ముంబైలోని వాంఖడేలో మిగతా రెండు వన్డేలు జరుగుతాయి. అనంతరం.. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌తో శుభ్‌మన్ గిల్ బృందం బిజీగా ఉండనుంది. జనవరి 21 నుంచి మార్చి 7వ తేదీ వరకూ ఇరుజట్లు ఐదు మ్యాచ్‌ల బోర్డర్ -- గవాస్కర్ ట్రోఫీలో తలపడతాయి. నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లో టెస్టు మ్యాచ్‌లు ప్రేక్షకులకు అసలైన క్రికెట్ మజాను పంచడం ఖాయం.

# ఇది శాశ్వతమైన ప్రేమ.. పెళ్లై నెల రోజులపై రష్మిక ఎమోషనల్ పోస్ట్

**విజయ్ దేవరకొండతో పెళ్లై నెల రోజులు పూర్తయిన సందర్భంగా రష్మిక పోస్ట్**

**పెళ్లిని విజయవంతం చేసిన స్నేహితులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు**

**రష్మిక పెట్టిన లాంగ్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్**




**టాకీస్:** డైనమిక్ హీరో విజయ్ దేవరకొండతో తన వివాహ బంధానికి నెల రోజులు పూర్తయిన సందర్భంగా స్టార్ హీరోయిన్ రష్మిక మందన భావోద్వేగభరిత పోస్ట్ చేశారు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తమ పెళ్లికి సంబంధించిన అద్భుతమైన ఫోటోలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ వేడుకను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ ఓ సుదీర్ఘమైన నోట్ రాశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

"అప్పుడే పెళ్లై నెల రోజులు గడిచిపోయిందంటే నమ్మలేకపోతున్నాను. పెళ్లి అనేది ఎప్పుడో జరిగే దూరపు ఆలోచనలా అనిపించేది. కానీ ఇప్పుడు మేం పెళ్లి చేసుకుని నెల రోజులైంది. ఇది నమ్మశక్యంగా లేదు. ఇది శాశ్వతమైన ప్రేమ" అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ మొత్తం ప్రయాణంలో తనకు కవచంలా నిలిచిన స్నేహితులను ఆమె ఎంతగానో కొనియాడారు. తన పెళ్లిని ఒక అద్భుతంగా మార్చిన వారికి రష్మిక ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యంగా తన స్నేహితురాలు ప్రియా మాగంటి గురించి ప్రస్తావిస్తూ.. "ఎన్నో ఏళ్లుగా నువ్వు నాకు ఒక బలమైన స్తంభంలా నిలిచావు. ఈ పెళ్లి ఇంత గొప్పగా జరిగిందంటే దానికి కారణం నువ్వే. నీకు కృతజ్ఞతలు అనే పదం కూడా సరిపోదు. నాకు ఏమీ తోచనప్పుడు నీకే ఫోన్ చేస్తాను. నువ్వు ఎప్పుడూ నాకు అందుబాటులో ఉంటావు" అని ఎమోషనల్ అయ్యారు. అలాగే, తమ వినూత్న ఆలోచనలకు రూపమిచ్చి, పెళ్లిని అద్భుతంగా తీర్చిదిద్దిన వెడ్డింగ్ ప్లానర్ అర్పితను, ఆమె బృందాన్ని ఎంతగానో ప్రశంసించారు. తమ ఆలోచనలకు అనుగుణంగా ఆభరణాలు రూపొందించిన వారికి కూడా ధన్యవాదాలు చెప్పారు.

తన జీవితంలో ఉన్న మహిళా స్నేహితుల గురించి చెబుతూ.. "మీరంతా నన్ను ఎప్పుడూ వాస్తవంలో, ప్రశాంతంగా ఉంచుతారు. ఇదే నా చిన్న ప్రపంచం" అని పేర్కొన్నారు. పెళ్లి రోజుల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా పూర్తి ఆనందంగా గడపమని సలహా ఇచ్చిన తన ఆప్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వారి వల్లే తమ పెళ్లి వేడుకలను పూర్తిగా ఆస్వాదించగలిగామని వివరించారు. ప్రస్తుతం రష్మిక షేర్ చేసిన ఈ ఫోటోలకు, పోస్ట్‌కు అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట, ఇటీవలే వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే.




# గ్లామర్ డోస్ పెంచిన కియారా అద్వాని

**టాకీస్:** హిందీ సినిమాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించిన కియారా అద్వానీ అక్కడ మంచి గుర్తింపు సంపాదించుకున్న తర్వాత టాలీవుడ్ వైపు అడుగులు వేసింది. ఈమె సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కిన 'భరత్ అనే నేను' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ మూవీ మంచి విజయం సాధించింది. ఆ తర్వాత తక్కువ కాలంలోనే రామ్ చరణ్ తో కలిసి నటించిన 'వినయ విధేయ రామ' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమా భారీ డిజాస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత ఈమె తెలుగులో చాలా కాలం పాటు సినిమాలు చేయలేదు. అలా చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత మరోసారి రామ్ చరణ్ హీరోగా రూపొందిన 'గేమ్ చేంజర్' చిత్రంలో హీరోయిన్గా నటించింది. కానీ ఈ మూవీ కూడా ఈ ముద్దుగుమ్మకు నిరాశనే మిగిల్చింది. కొంతకాలం క్రితం ఈమె హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ హీరోలుగా తెరకెక్కిన 'వార్ 2' చిత్రంలో హీరోయిన్గా నటించింది. ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టినప్పటికీ, ఇందులో ఈమె తన అందాలతో మాత్రం యువత మనసును కొల్లగొట్టింది. సినిమాల్లో ఇప్పటికే అనేక సార్లు తన అందాలతో ప్రేక్షకులను అలరించిన ఈ నటి సోషల్ మీడియాలో కూడా ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా ఈమె తనకు సంబంధించిన కొన్ని ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. అందులో ఈ బ్యూటీ బ్రౌన్ కలర్‌లో పొడవాటి టైట్ స్టైల్ గౌన్ ధరించి ఎంతో ఆకర్షణీయంగా నిలబడి స్టిల్స్ ఇచ్చింది. ఇందులో ఆమె ఒక చేతిని తలపై ఉంచి, తన హెయిర్‌ను ముందుకు వేసి కిల్లింగ్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది. ఈమె ధరించిన నెక్లెస్ ఆమె అందాన్ని మరింతగా పెంచింది. ఈ ఫోటోలలో ఈ బ్యూటీ ఎద అందాలు ఫోకస్ అయ్యేలా స్టిల్స్ ఇవ్వడంతో, సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# తెరపైకి మరో రామాయణ కావ్యం

**వాల్మీకి రామాయణ పోస్టర్ విడుదల**




**టాకీస్:** భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. 'పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది' అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండగా.. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ అందిస్తున్నాడు. ఆనంద్ నీలకంఠన్ మరియు చంద్రప్రకాష్ ద్వివేది కథను అందిస్తున్నారు. మరోవైపు ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# వివేక్ అగ్నిహోత్రి మూవీ...ఆపరేషన్ సిందూర్



**టాకీస్:** 'ది కాశ్మీర్ ఫైల్స్', 'ది వ్యాక్సిన్ వార్' వంటి వివాదస్పద చిత్రాలతో సంచలనం సృష్టించిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. 'ఆపరేషన్ సిందూర్' అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం కోసం ఆయన ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్‌తో (టీ-సిరీస్) చేతులు కలిపినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టైనీ' ధిల్లాన్ రాసిన పుస్తకం ఆధారంగా తెరకెక్కుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, భారత సాయుధ దళాలలోని వివిధ విభాగాలు సమన్వయంతో సాగించిన లోతైన పరిశోధనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. కేవలం శబ్దం చేయడం కోసం కాకుండా, వాస్తవాలను క్లారిటీతో, సినిమా మాయాజాలంతో ప్రపంచానికి చాటి చెప్పడమే తమ లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. పల్లవి జోషి, వివేక్ అగ్నిహోత్రి తమ 'ఐ యామ్ బుద్ధ' ప్రొడక్షన్స్‌పై టీ-సిరీస్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఉస్తాద్‌లో పవన్ కళ్యాణ్ ఎంట్రీ అదుర్స్

**ప్రేక్షకుల స్పందనపై హరీష్ కామెంట్స్**




**టాకీస్:** పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు. కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించుకోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు. రెండూ బాగున్నాయి అనిపించింది. నచ్చాయి అంటే లాజిక్‌లను పట్టించుకోను. 'ధురంధర్ 2' కలెక్షన్స్ చూసి నాకు కూడా ఆనందంగానే ఉంది. మీరు గమనిస్తే.. నేను ఉస్తాద్‌లో చూపించిన దేశభక్తిని ఆదిత్యధర్ పూర్తిస్థాయిలో 'ధురంధర్ 2'లో చూపించారు. నా భావాలతో నాకు నచ్చిన సినిమా.. నా చిత్రం కంటే బాగా హిట్ అవుతోంది అన్నప్పుడు ఒకరకమైన ఆనందం ఉంటుంది కదా.. నేను ఇప్పుడు అదే సంతోషంలో ఉన్నాను. మనమందరం సినిమా లవర్స్. ఏ సినిమా విజయం సాధించినా ఆనందమే. ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా తక్కువ సినిమాలు చేశాను. నేను తొమ్మిది సినిమాలు చేస్తే.. దాదాపు 10 చిత్రాలు క్యాన్సిల్ చేశా. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. స్క్రిప్ట్ కుదరకపోవడం, హీరో చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడం.. ఇలా ఎన్నో ప్రాజెక్టులు చేయలేకపోయా. ఎన్టీఆర్‌తో 'ఎంఎల్‌ఏ' చేద్దాం అనుకున్నా. కానీ, కుదర్లేదు. క్యాన్సిల్ అయిన ప్రాజెక్టులకు వర్క్ చేసి కూడా పట్టాలెక్కించలేకపోయా. ఇకనుంచి అలా జరగదు. చాలా కథలు రాసుకున్నా. వరుసగా తెరకెక్కిస్తాను.

# రామ్‌చరణ్ కంటికి స్వల్ప సర్జరీ

**డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిరు**



**టాకీస్:** 'పెద్ది' సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు.డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి 'పెద్ది' షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

# ధురంధర్ ప్రచారంపై చర్యలు తప్పవు

**దర్శకుడు ఆదిత్య ధర్ హెచ్చరిక**



**టాకీస్:** దర్శకుడు ఆదిత్య ధర్ తన తాజా చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై స్పందించారు. నెట్టింట వైరల్ అవుతున్న ఒక మార్ఫింగ్ ఫోటోపై ఆయన స్పష్టతనిచ్చారు. అది సినిమాకు సంబంధించినది కాదంటూ పోస్ట్ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్2' చిత్రానికి లభిస్తోన్న ఆదరణ చూసి నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. అయితే, కొంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఉపయోగించి మా అధికారిక ప్రోమోలను మారుస్తూ తప్పుడు కథనాలను సృష్టిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా, ఈ చిత్రంలోని హంజా (జస్కీరత్) పాత్ర తలపాగా ధరించి సిగరెట్ తాగుతున్నట్లు ఉన్న ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది పూర్తిగా అబద్ధం. మా సినిమాలో కానీ, మేము విడుదల చేసిన ఏ ఇతర అధికారిక వీడియోల్లో కానీ అలాంటి సీన్ లేదు. ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించాలని కొందరు చేస్తోన్న పని. సిక్కులు అంటే నాకెంతో గౌరవం. ఈ చిత్రంలో ప్రతి పాత్రను ఎంతో బాధ్యతతో వారిపై గౌరవంతోనే చిత్రీకరించాం. ఏఐతో సృష్టించిన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరుతున్నాను. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాను అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ధురంధర్ 2' మార్చి 19న విడుదలైంది. తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఏడు రోజుల్లో రూ.1000కోట్ల క్లబ్‌లో చేరినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకూ రూ.1,006 కోట్లు తన ఖాతాలో వేసుకుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.